సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



14,918 క్యూసెక్కుల వరద
సోమశిల: జలాశయానికి 14,918 క్యూసెక్కుల వరద జలాలు వస్తున్నాయి. సోమవారానికి 18.013 టీఎంసీలకు చేరుకుంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు
24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.72,080
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,473
3 శాతం జీఎస్టీతో	రూ.6,667
సవర (8 గ్రా)	రూ.53,336

గరిష్టం/కనిష్టం
38.5 /28.0

వాతావరణం
జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. గాలిలో తేమ 59 శాతం ఉంది.

న్యూస్‌రీల్

పంచాయతీలో అవినీతిపై విచారణ



విచారణ చేస్తున్న కమిషనర్ నాగార్జున సాగర్

ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీలో గతంలో నిధుల గోల్‌మాల్ జరిగిందన్న ఫిర్యాదుపై పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ నాగార్జున సాగర్ సోమవారం కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆయనతో పాటు జిల్లా పంచాయతీరాజ్ అధికారుల బృందం పాల్గొంది. గతంలో పని చేసిన కార్యదర్శి, నాయకులు పెద్ద ఎత్తున నిధులు గోల్‌మాల్ చేశారని ఇటీవల టీడీపీ నాయకులు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. సర్పంచ్ బూదూరు లక్ష్మి, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

909 పొగాకు బేళ్ల విక్రయం
మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 909 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1,084 బేళ్లు రాగా అందులో 909 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 1,21,066 కిలోల పొగాకును విక్రయించగా రూ.3,77,83,609.80 వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ట ధర రూ.358 కాగా కనిష్ట ధర రూ.204 లభించింది. సగటున రూ.312.09 నమోదైంది. వేలంలో 12 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల అధీనంలోనే జామాయిల్ లోడ్ లారీ



విలేకరులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: ప్రభుత్వ, అగ్రిగోల్డ్ సంస్థ భూముల్లో జామాయిల్ నరికి తరలిస్తున్న లారీ పోలీసుల అధీనంలోనే ఉందని తహసీల్దార్ సుభద్ర, ఎస్సై ఇంద్రసేనారెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని పలు వివాదాస్పద భూములు, అగ్రిగోల్డ్ భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ చెట్లను కొందరు అక్రమార్కులు నరికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనంపై ఈ నెల 11న 'సాక్షి'లో 'యథేచ్ఛగా జామాయిల్ నరికివేత' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ లారీని వదిలి పెట్టలేదని వివరణ ఇచ్చారు. ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ అక్రమంగా జామాయిల్ తరలిస్తున్న లారీని ఇటీవల స్వాధీనం చేసుకున్నామన్నారు. జామాయిల్ పరిమాణం, ధరను నిర్ధయిస్తూ రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ చేయకపోవడంతో కోర్టుకు హాజరు పర్చలేదన్నారు. తహసీల్దార్‌కు నివేదించామని, అంచనా వ్యాల్యూ వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి కోర్టులో పెడతామన్నారు. అయితే అధికారులకు పట్టుబడిన లారీని గుట్టుచప్పుడు కాకుండా కేసు నుంచి విముక్తి చేయాలని కొంత మంది నాయకులతో కలిసి పన్నాగం 'సాక్షి' కథనంతో ఫలించలేదు. ఆ లారీ వివరాలను స్వయంగా అధికారులే వెల్లడించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉపరాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు
• కలెక్టర్ ఒ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ జిల్లా పర్యటనకు ప్రొటోకాల్ నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఒ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న భారత ఉప రాష్ట్రపతి జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉప రాష్ట్రపతి కార్యాలయ కార్యదర్శి ఆమోదం పొందిన కార్యక్రమం మేరకు ఎటువంటి మార్పులకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పటిష్ట పోలీస్ బందోబస్తుకు పక్క జిల్లాల నుంచి సిబ్బందిని పిలిపించాలన్నారు. పోలీస్ కవాతు మైదానంలో మూడు హెలిప్యాడ్‌లను సిద్ధం చేయాలన్నారు. కాన్వాయ్‌లోని వాహనాలు పూర్తి కండిషన్‌లో ఉండే విధంగా, ఆధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ ఉంచాలన్నారు. ఉపరాష్ట్రపతి కాన్వాయ్ పోలీస్ కవాతు మైదానం నుంచి బయలుదేరి వెంకటాచలం మండలంలోని అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో కార్యక్రమాల అనంతరం తిరిగి పోలీస్ కవాతు మైదానం చేరేంత వరకు అధికారులకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఆర్‌ఓ లవన్న, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తవ్వకాల్లో తగ్గేదేలే..



సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. గతంలోనూ టీడీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో భారీ స్థాయిలో గోతులు పెట్టి గ్రావెల్ దోచుకున్నారు. తెలుగుతమ్ముళ్ల ధనదాహానికి ఏర్పడిన గుంతల్లో పడి ఒక్క వెంకటాచలం మండలంలోనే సుమారు 9 మంది పిల్లలు మృత్యువాత పడ్డారు. అయినా వారి తీరు మారడం లేదు. ఎవరు ఏమైతే మాకెందుకు మాకు డబ్బులే ముఖ్యమనే రీతిలో వ్యవహరిస్తున్నారు. తాజాగా అధికారం చేజిక్కడంతో కోళ రాలపై పడిన రాబందుల్లా ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు.



తవ్వకాలతో ఏర్పడిన గోతులు



రిజర్వాయర్‌లో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న జేసీబీ

గ్రావెల్ మాఫియా బరితెగింపు
- సర్వేపల్లి రిజర్వాయర్‌లో భారీ గోతులు పెట్టి అక్రమ తవ్వకాలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఆయకట్టు రైతులు
- అడ్డుకున్న రెవెన్యూ, పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గం అవినీతి, అక్రమాలు, సహజవనరుల దోపిడీలు, జూద క్రీడలకు నిలయంగా మారింది. టీడీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని బరితెగించి వ్యవహరిస్తున్నారు. ప్రజలు అడ్డుకుంటున్నా.. పత్రికలు ఘోషిస్తున్నా సహజ వనరుల దోపిడీ, తవ్వకాల్లో తగ్గేదేలే అంటున్నారు. అధికారం మాదే మమ్మల్ని ఎవరూ ఆపలేరంటూ విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేతల అక్రమాలపై స్థానికులే ఎదురు తిరుగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఇసుక కోసం ప్రతిష్టాత్మకమైన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకపోయినా.. గ్రామస్తులు అడ్డు చెబుతున్నా ఆగడం లేదు. మట్టి, గ్రావెల్ కోసం చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను చెరపట్టి దోచుకుంటున్నారు. ఎక్కడికక్కడే యంత్రాలు పెట్టి తోడేస్తూ అక్రమార్జన చేస్తున్నారు.

సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ దందా

వెంకటాచలం మండలం సర్వేపల్లి రిజర్వాయర్‌లో గ్రావెల్ దందాకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. టీడీపీకి చెందిన గ్రావెల్ మాఫియా తిష్ట వేసి ఇరిగేషన్, భూగర్భ, గనుల శాఖ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. గత నెల రోజులుగా రేయింబవళ్లు భారీ యంత్రాలతో బావుల్లాంటి గోతులు పెట్టి గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. అక్కడ నుంచే ట్రాక్టర్లు, టిప్పర్లతో నెల్లూరు రూరల్, సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్న రియల్ వెంచర్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం వందల ట్రిప్పులతో గ్రావెల్ తరలిపోతుంది. రోజూ రూ.లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారు. గ్రావెల్ తవ్వకాలతో బావుల్లాంటి గోతులు ఏర్పడి రిజర్వాయర్ ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో..

సర్వేపల్లి రిజర్వాయర్‌లో సోమవారం ఉదయం టీడీపీ నేతలు రోజూ మాదిరిగానే జేసీబీ ట్రాక్టర్లతో అక్రమ తవ్వకాలను ప్రారంభించారు. గ్రావెల్ మాఫియా చర్యలతో రిజర్వాయర్ ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడడంతో రైతులు కొద్ది రోజులుగా అడ్డుకుంటున్నారు. అధికార పార్టీ నేతల తీరుపై స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రావెల్ తవ్వకాలు ఆపకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఉన్నతాధికారులను హెచ్చరించడంతో అక్కడి పరిస్థితి అదుపు తప్పుతుందని తెలుసుకున్నారు. వెంటనే తవ్వకాలను అడ్డుకోవాలని రెవెన్యూ, పోలీసులను ఆదేశించారు. దీంతో ఆర్‌ఐ రవి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్నారు. అక్రమ తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అధికారులపై ముఖ్యనేత ఒత్తిళ్లు

సర్వేపల్లి నియోజకవర్గంలో జరిగే అక్రమాలకు అధికారం అండగా నిలుస్తోంది. ఇసుక, మట్టి, గ్రావెల్, జూదం వంటి మాఫియాల నుంచి వాటాలు దండుకుంటున్న నియోజకవర్గ స్థాయి ముఖ్య నేత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు సైతం తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ఆయా మాఫియాల నుంచి తమ వాటాలు తీసుకుని మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ వైపు అధికార పార్టీ నేతల ఒత్తిడి, మరో వైపు ప్రజల ఫిర్యాదులతో అధికారులు సైతం తమ వాటాలు పెంచుకుంటూ మేము ఏం చేయగలం.. అధికార పార్టీ నేతలు చెప్పినట్లే వినక తప్పదని మాఫియాలకు అండదండలు అందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వెంకటాచలం పోలీసులు గ్రావెల్ అక్రమ రవాణా చేసే వాహనాలను అదుపులోకి తీసుకున్నా.. అధికార పార్టీ నేతల ఒత్తిడితో అప్పుడే వదిలేశారు.

గతంలో 9 మంది పిల్లలు మృత్యువాత

సర్వేపల్లి రిజర్వాయర్‌తో పాటు వెంకటాచలం మండలంలో టీడీపీ నేతలు తవ్విన బావుల్లాంటి గుంతల్లో పడి అభంశుభం తెలియని 9 మంది చిన్నారులు గతంలో మృత్యువాతపడ్డారు. ఆ బిడ్డల తల్లిదండ్రులకు గుండెకోతను మిగిల్చారు. టీడీపీ నేతలు ధనదాహానికి పసి మొగ్గలు ప్రాణాలు పోయినా.. పోతున్నా కనీసం వారిలో ఏమాత్రం కనికరం, మానవత్వం కనిపించడం లేదు. ఎవరు పోతే మాకెందుకు మాకు డబ్బే ముఖ్యమంటున్నారు.

చెరువు కట్టనే తవ్వేసి..
రేయింబవళ్లు గ్రావెల్ తరలింపు

ఉలవపాడు: టీడీపీ నేతలు బరి తెగించారు. గ్రావెల్ దోపిడీకి రహదారి కోసం ఏకంగా చెరువు కట్టనే తవ్వేసి రోడ్డును వేశారు. రేయింబవళ్లు జేసీబీలు పెట్టి నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వేస్తున్నారు. టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గ్రావెల్ రవాణాదారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పట్టించుకోలేదు. గ్రావెల్ తరలింపుపై నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. వాళ్లకు అనుమతులు ఉన్నాయని, చెరువు కట్టను ధ్వంసం చేస్తే పరిశీలిస్తామని చర్యలు తీసుకుంటామని ఏఈ రమణ రెండు రోజుల క్రితం గ్రామస్తులకు తెలిపారు. చెరువు కట్టను పూడ్చి వేయిస్తామని హామీ ఇచ్చారు. అయినా గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా ఆగడం లేదు. చెరువు కట్ట పూడ్చలేదు. వర్షం పడుతున్న సమయంలో రైతుల అవసరాలకు నీరు నిల్వ ఉండాల్సిన చెరువులో ఇలా గ్రావెల్ తరలింపు ఏంటని ప్రశ్నిస్తున్నారు. అనుమతులు ఉన్నా రాత్రిళ్లు ఇష్టం వచ్చినట్లు తరలిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం, గ్రావెల్ అక్రమార్కుల స్వార్థంతో రైతుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం అవుతోంది.



చెరువు కట్ట ధ్వంసం చేసి లోపలికి వేసిన రోడ్డు



రాజుపాళెం చెరువు నుంచి తరలిస్తున్న గ్రావెల్

'భోజనం తినలేకపోతున్నాం సార్'



కేజీబీవీని పరిశీలిస్తున్న కందుకూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి నిఖిల్‌రెడ్డి

• కేజీబీవీని పరిశీలించిన న్యాయమూర్తి

కందుకూరు రూరల్: 'పాఠశాలలో భోజనం సరిగా ఉండడం లేదు. తినలేకపోతున్నాం. మంచినీరు కూడా సరిగా ఉండడం లేదు.' అని పామూరు రోడ్డులోని కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థులు కందుకూరు కోర్టు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ జడ్జి నిఖిల్‌రెడ్డికి విన్నవించారు. సోమవారం న్యాయమూర్తి కేజీబీవీని సందర్శించి అక్కడి పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్‌కు అధ్యాపకులు లేరని న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 6 గంటలకు వస్తే సాయంత్రం 7 గంటలకు వెళ్లాల్సి వస్తుందని, జీతం మాత్రం రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారని, సరిపోవడం లేదని వంట మనిషి న్యాయమూర్తికి తెలిపారు. ప్రిన్సిపల్ వి.స్వాతి సెలవులో ఉండడంతో ఆమెను మంగళవారం కోర్టుకు వచ్చి తనను కలవాలని ఆదేశించారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

- 15 నుంచి రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ ఓ. ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలో ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో రెవెన్యూ సదస్సుల నిర్వహణ తదితర అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యూటేషన్ ట్రాన్సాక్షన్లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎటువంటి కారణాలు లేకుండా అప్లికేషన్లు తిరస్కరణ చేయవద్దన్నారు. గ్రామాల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు సూచించిన ప్రదేశాల్లో చెత్తా చెదారాన్ని తొలగించి వెక్టార్ కంట్రోల్ హైజనిక్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను విరివిగా అందించాలని, ఈ పంట నమోదును వేగవంతం చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఆప్షన్-1, 2 లబ్ధిదారులకు బిల్లు కూడా ప్రభుత్వం చెల్లింపు చేస్తుందని, వెంటనే ఈ కేటగిరీ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి రోజు లక్ష పనిదినాలు లక్ష్యంగా ఉపాధి హామీ పనులు జరగాలన్నారు. జిల్లాలో 250కు పైగా పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయని, వీటిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల అటెండెన్స్ పరిశీలిస్తున్నట్లు చెప్పారు. టీచర్లు సమయపాలన పాటించడం లేదని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇన్‌చార్జి జేసీ సూర్యతేజ, డీఆర్‌ఓ లవన్న, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డ్వామా పీడీ శ్రీనివాసులు, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, హౌసింగ్ పీడీ దయాకర్, ఐటీడీఏ పీఓ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుపై ప్రకృతి పగ

- ఆగస్ట్ నెలలోనూ ఎండ తీవ్రత, ఉక్కపోత
- మౌల్టింగ్ లేక ఎదుగుదల లేని రొయ్యలు
- పెరుగుతున్న పెట్టుబడులు



రొయ్యల గుంతల్లో ఆక్సిజన్ పెంచేందుకు వినియోగిస్తున్న ఏయిరేటర్లు



పట్టుబడి చేసిన రొయ్యలు

బిట్రగుంట: ఆక్వా రైతుపై ప్రకృతి పగ బట్టింది. చల్లని వాతావరణంతో గుంతల్లో దిగుబడి పెరగాల్సిన సమయంలో ఊహించని విధంగా ఎండలు పెరిగిపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రొయ్యల ఎదుగుదల తక్కువగా ఉంటుంది. జూన్ రెండో వారం నుంచి వాతావరణం చల్లబడి తొలకరి జల్లులు, చల్లని గాలులతో రొయ్యల్లో మౌల్టింగ్ ప్రక్రియ చురుగ్గా జరిగి (గుల్ల విడవడం) త్వరగా ఎదుగుతాయి. అయితే ఆగస్ట్ మూడో వారం వస్తున్నా.. ఎండలు తగ్గకపోవడంతో రొయ్యల్లో మౌల్టింగ్ ప్రక్రియ జరగడం లేదు. గుంతల్లో నీళ్లు త్వరగా ఆవిరవుతుండటంతో ప్రతి రోజూ గుంతల్లో నీళ్లు కూడా పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రొయ్య పిల్లలు ఒత్తిడికి గురై ఎదుగుదల అంతంతమాత్రంగా ఉంటుంది. ఎండలతో గుంతల్లో నీళ్లు తగ్గిపోతుండడం, ఉక్కపోత కారణంగా ఆక్సిజన్ శాతం కూడా పడిపోతుండడంతో రొయ్యలు గుంతల్లో పైకి తేలుతున్నాయి. మధ్యాహ్న సమయంలో విపరీతమైన ఉక్క వాతావరణంతో ఆక్వా గుంతల్లో డిసాల్వ్‌డ్ ఆక్సిజన్ సమస్య తలెత్తుతుంది. నీళ్లల్లో ప్రాణవాయువు (డిసాల్వ్‌డ్ ఆక్సిజన్) తగ్గిపోయి రొయ్యలు నీళ్లపైకి తేలుతున్నాయి. కావలి, అల్లూరు, బోగోలు మండలాల్లో సుమారు ఎనిమిది వేల ఎకరాలకు పైచిలుకు విస్తీర్ణంలో రైతులు వెనామీ సాగు చేస్తున్నారు. వేసవి కాలం మాదిరి ఉదయం నుంచే భానుడు ప్రతాపం, సాయంత్రం ఉక్కపోతతో రొయ్యలు ఆక్సిజన్ కోసం నీళ్లపైకి వచ్చేస్తున్నాయి. రొయ్యలు నీళ్లపైకి తేలిన సమయంలో ఎండ తీవ్రత కారణంగా వ్యాధులకు గురవుతున్నాయి. మరో వైపు ఆక్సిజన్ లేని కారణంగా రొయ్యలు నీరసించి మేత కూడా సరిగా తీసుకోవడం లేదని, మౌల్టింగ్ ఆగిపోయి (గుల్ల విడవడం) ఎదుగుదల నిలిచిపోతుందని రైతులు వాపోతున్నారు. గుంతల్లో పిల్లలు వదిలి 90 రోజులు దాటుతున్నా మౌల్టింగ్ జరగని కారణంగా 70 కౌంట్ దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా 90 రోజులకు 50-40 కౌంట్‌కు రావాల్సిన రొయ్యలు 70 కౌంట్ దాటకపోవడంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడి తగ్గడంతో పెరుగుతున్న ధరలు

వాతావరణ మార్పుల కారణంగా రొయ్యల దిగుబడి తగ్గడంతో ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. పది రోజుల వ్యవధిలో కిలో రొయ్యలకు కౌంట్‌ను బట్టి రూ.20 నుంచి రూ.30 పెరిగింది. రెండు వారాల క్రితం 100 కౌంట్ ధర రూ.220 ఉండగా ప్రస్తుతం రూ.250కు చేరుకుంది. 90 కౌంట్ రూ.260, 80 కౌంట్ రూ.270, 70 కౌంట్ రూ.290, 60 కౌంట్ రూ.310, 50 కౌంట్ ధర రూ.330 నుంచి రూ.340 మధ్య, 40 కౌంట్ రూ.365 నుంచి రూ.370 మధ్య వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు ముందుగానే స్థానిక వ్యాపారుల వద్ద రొయ్యల సాగుకు పెట్టుబడుల రూపంలో ఫీడ్, మందులు అప్పుగా తీసుకుంటుండటంతో వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లిం సంఘాలు

నెల్లూరు (దర్గామిట్ట): వక్ఫ్‌బోర్డు చట్టం సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ముస్లిం సంఘాలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ జియాఉల్ హక్, జేఏసీ రాష్ట్ర నాయకు ఆసిఫ్‌పాషా మాట్లాడుతూ ఈ నెల 8న పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్రం పెట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా వక్ఫ్ బోర్డుకు 9.4 లక్షల ఎకరాల భూములు ఉన్నాయని, ఇప్పటికే పలు మార్లు చట్ట సవరణ చేసినప్పటికీ అవి అన్యాక్రాంతమవుతూనే ఉన్నాయన్నారు. చట్ట సవరణ పేరుతో ముస్లిమేతరులకు, మహిళలకు ప్రాధాన్యత కల్పించేందుకు, వక్ఫ్ ఆస్తులపై కలెక్టర్లకు పూర్తి అధికారులను బదలాయించాలనే ప్రయత్నం జరుగుతుందన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన వక్ఫ్ బోర్డును విచ్ఛిన్నం చేసి ముస్లిం సమాజాన్ని సామాజిక, ఆర్థిక రంగాల్లో పూర్తిగా వెనుకబాటు తనానికి గురి చేయాలనే దురుద్దేశంతో కేంద్రం ఈ చట్ట సవరణ చేస్తుందని పార్లమెంట్‌లో మెజార్టీ సభ్యులు ఈ బిల్లును వ్యతిరేకించారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి ముస్లింల గొంతు నొక్కుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లు పెట్టగానే టీడీపీ ఎంపీ జీహెచ్ మాధుర్ బాలయోగి మద్దతు ఇవ్వడం దుర్మార్గమన్నారు. మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ విజ్ఞప్తిని కూడా చంద్రబాబునాయుడు పరిగణలోకి తీసుకోకుండా ముస్లిం మనోభావాలను దెబ్బ తీశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 68 వేల ఎకరాల పైచిలుకు ఉన్న వక్ఫ్ భూములు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ పార్టీ అధ్యక్షుడు జిలాని, సీపీఐ రైతు సంఘం నాయకుడు షానవాజ్, హాజీ మొహమ్మద్ హనీఫ్, మౌలానా అబ్దుల్ హఫీజ్, హాజీ సంధాని, సయ్యద్ రెహ్మాన్, సయ్యద్ షంషుద్దీన్, ఎం. బాబు, షఫీ, మహబూబ్‌బాషా, జమీర్ అహ్మద్, ఇలియాజ్, హఫీజ్ పాల్గొన్నారు.

కారు బోల్తా పడి ఇద్దరి మృతి




శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు మృతదేహాలు

మర్రిపాడు: మండలంలోని బూదవాడ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. బూదవాడ గ్రామానికి చెందిన శనివారపు శ్రీనివాసులురెడ్డి (31) బేల్దారి పనులు చేస్తుంటాడు. వివాహమైంది. ఒక కుమారుడు, ఆరు నెలల వయస్సున్న పాప ఉన్నారు. ఇతను, అదే గ్రామానికి చెందిన రాజుపాళెం వెంకటేశ్వర్లు (27), కె.యానాదిరెడ్డి కారులో బ్రాహ్మణపల్లికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు గతంలో వలంటీర్‌గా పనిచేశాడు. అవివాహితుడు. కాగా యానాదిరెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. శ్రీనివాసులురెడ్డి మృతితో అతని కుటుంబం వీధిన పడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాష్‌పాండ్ బాధితులను ఆదుకోవాలి



జెన్‌కో ఎదుట ధర్నా చేస్తున్న నేతలు

ముత్తుకూరు: మండలంలోని ఏపీ జెన్‌కో ప్రాజెక్టుకు చెందిన యాష్‌పాండ్ కట్టకు గండి పడి బూడిద పొలాలను ముంచెత్తిన కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నేలటూరులోని జెన్‌కో ఎదుట ధర్నా చేశారు. పొలాలు, రొయ్యల చెరువులు బూడిదమయం కావడంతో ఎకరాకు రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోగుల శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య, టీపీ గూడూరు మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, కాల్తిరెడ్డి రమణమ్మ, పట్టపు జయరామయ్య, గోడమల్లి కొండయ్య తదితరులు మాట్లాడారు. యాష్‌పాండ్ పరిసర గ్రామాల పేదలకు రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జి సీఈ వెంకటేశ్వరావు, హెచ్‌ఆర్ మేనేజర్ భాస్కర్‌రావుకు వినతిపత్రాలు అందజేశారు.

దంపతులపై దాడి

- భర్త పరిస్థితి విషమం
- నెల్లూరుకు తరలింపు

ఆత్మకూరు: భార్యాభర్తలపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అకారణంగా దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం ఆత్మకూరు పట్టణంలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. వాశిలి గ్రామానికి చెందిన ప్రభాకర్, సుశీల దంపతులు తమ కుమారుడితో కలిసి సుశీల స్వగ్రామమైన బట్టేపాడుకు బయలుదేరారు. ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సమీపంలో బస్సు ఎక్కే ముందు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మలుపు వద్ద ఉన్న దుకాణం వద్దకు వెళ్లారు. కూల్‌డ్రింక్ తాగి వెళ్తుండగా ఇద్దరు యువకులు ఒక్కసారిగా వచ్చి తొలుత ప్రభాకర్‌పై దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన సుశీలను కూడా కొట్టారు. ఈ దాడిలో ప్రభాకర్ తల, కంటిపై తీవ్ర గాయాలయ్యాయి. సుశీల కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. ప్రభాకర్‌ను ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులకు సమాచారం అందడంతో విచారణ చేస్తున్నారు.

హుండీలు ఎత్తుకెళ్లి నగదు చోరీ

గుడ్లూరు(కందుకూరు రూరల్): రెండు ఆలయాల్లో హుండీలు చోరీ చేసిన ఘటన గుడ్లూరు మండలంలోని కొత్తపేటలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కొత్తపేట గ్రామ శివారులో ఉన్న గంగమ్మ తల్లి ఆలయ హుండీని దొంగలు తీసుకెళ్లి నగదు చోరీ చేశారు. అనంతరం పోలేరమ్మ ఆలయంలోని హుండీని చోరీ చేసి అందులోని నగదు అపహరించి దూరంగా పొలాల్లో పడేసి పరారయ్యారు. సోమవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు గుడ్లూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గంగమ్మ తల్లి గుడిలో సీసీ కెమెరాలున్నా పనిచేయడం లేదు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



స్టేషన్ వద్ద ట్రాక్టర్

అల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. పెన్నానది నుంచి విడవలూరు మండలం ముదివర్తి గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో బిల్లుల్లేకుండా ఇసుకను అల్లూరు గాలిదిబ్బలు గ్రామానికి తరలిస్తున్నారు. కోనేటి సెంటర్ ప్రాంతంలో రాత్రి గస్తీలో ఉన్న పోలీస్ సిబ్బంది వాటిని పట్టుకున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.40

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 103
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 196
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 216
లేయర్ చికెన్	: 161

పాఠాలు చెప్పడం లేదు సార్



కలెక్టర్‌కు సమస్యను చెబుతున్న విద్యార్థులు

- ఈ చిత్రంలో కలెక్టర్ ఒ.ఆనంద్‌తో మాట్లాడుతున్న విద్యార్థులు నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్నారు. తమ బడిలో ఉపాధ్యాయుల బోధన బాగోలేదంటూ తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సోషల్, తెలుగు సబ్జెక్ట్‌లు బోధించే టీచర్లు లక్ష్మీప్రసన్న, శ్రీనివాసులు తరగతులకు రావడం లేదని వాపోయారు. స్కూల్లో తాగునీటి సౌకర్యం కూడా లేదని, దృష్టి సారించాలని విన్నవించారు.

కార్మికుల కష్టాలు తీర్చండి



కలెక్టర్‌కు సమస్యను చెబుతూ..

- కలెక్టర్ ఆనంద్‌ను మైకా గనుల యజమానులు ప్రణయ్‌రెడ్డి, ద్వారకానాథ్ తదితరులు కలిసి సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. అన్ని అనుమతులున్న తమ గనులను మూసివేయడంతో వేలాది మంది కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. అలాగే మైనింగ్ పరిశ్రమకు ప్రత్యామ్నాయంగా ఉన్న ఫ్యాక్టరీలు కూడా మూతపడడంతో అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. మైనింగ్ ఆపరేషన్లకు అనుమతి ఇచ్చి కార్మికుల కష్టాలను తీర్చాలని కోరారు.

చాలా దూరం నుంచి వచ్చామయ్యా..

- అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్
- పాఠశాల సమస్యలపై విన్నవించిన విద్యార్థులు
- మైనింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరిన యజమానులు

నెల్లూరు(దర్గామిట్ట): 'సార్.. చాలా దూరం నుంచి వచ్చాం. మా సమస్యలు ఆలకించి పరిష్కారం చూపండి' అంటూ ప్రజలు విజ్ఞప్తి చేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. దీనికి అర్జీదారులు వెల్లువలా వచ్చారు. కూటమి ప్రభుత్వంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో అనేకమంది మళ్లీమళ్లీ వస్తున్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశిస్తున్నా ప్రతి వారం వందల సంఖ్యలో అర్జీలు పెరుగుతున్నాయి. సోమవారం 232 వినతులు రాగా అందులో 138 రెవెన్యూకు సంబంధించినవే.

వినతుల్లో కొన్ని..

- దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చించాలని బిషప్ ఎండీ ప్రకాశం కోరారు. నెల్లూరు యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం ఆధ్వర్యంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత క్రైస్తవ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ ఎలిషా కుమార్, ఫాదర్ వరప్రసాద్, వీజీ ఇన్నయ్య, ప్రిన్సిపల్ ఏసురాజ్యం, ఇంకా ఏసురత్నం, డాక్టర్ సురేంద్రబాబు, రాజశేఖర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.
- డిప్యూటీ తహసీల్దార్ తనపై కులవివక్ష చూపుతున్నారని విడవలూరు మండలం ముదివర్తి వీఆర్వో జి.దయానంద్ వినతిత్రం అందించారు. ఐదునెలల నుంచి వీఆర్ఏను తన దగ్గరకు రానివ్వకుండా చేస్తున్నారని, మూడు నెలల జీతం, ఆరు సంవత్సరాల ఇంక్రిమెంట్‌ను రెవెన్యూ అధికారులు నిలిపివేశారన్నారు. గతంలో ఎన్నికల బీఎల్వో విధుల్లో ఉండగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల జీతం ఆపేశారన్నారు.
- మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేతలు నిరసన చేపట్టారు. జీఓ నంబర్ 84ను రద్దు చేయాలన్నారు. పురపాలక పాఠశాలల్లో ఖాళీలను విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యా దీవెన ఇవ్వండి

ప్రభుత్వం ఇప్పటి వరకు విద్యా దీవెన పథకాన్ని అమలు చేయలేదని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ యానాదుల సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా కమిటీ నేతలు అన్నారు. ఆ సంఘం జిల్లా చైర్మన్ బీఎల్ శేఖర్ అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో వేలాది మంది గిరిజనులు చదువుతున్నారని, విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజులు చెల్లిస్తేనే కళాశాలకు రావాలని, లేకుంటే మానుకోవాలని వారికి యాజమాన్యాలు చెబుతున్నాయన్నారు. గిరిజన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక కళాశాలలు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ మండలం 12వ డివిజన్ మంగళదిబ్బ గిరిజన కాలనీకి చెందిన శ్మశానవాటికను కొందరు ఆక్రమించుకుంటున్నారని, దానికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు మాణిక్యాల నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు నంది నారాయణ, విద్యా విభాగం కన్వీనర్ బత్తిన లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించాలని కోరుతూ..



ఈ చిత్రంలో వ్యక్తి పేరు కంసాని మల్లికార్జున. ఊరు బోగోలు మండలంలోని ఎస్‌పీ పాళెం. 15 సంవత్సరాల వయస్సున్న తన కుమార్తె విఘ్నేశ్వరిని ఇలా భుజాన మోసుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ బాలిక అనారోగ్యం కారణంగా పుట్టినప్పటి నుంచి మంచానికే పరిమితమై ఉంది. వీరిది పేద కుటుంబం. మల్లికార్జున వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. తన కుమార్తెకు నెలకు రూ.15 వేల పింఛన్ అందజేసి భరోసా కల్పించాలంటూ ఆయన అధికారులను వేడుకున్నారు.

విచారించి.. న్యాయం చేయండి

- పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- జిల్లా నలుమూలల నుంచి 98 మంది రాక
- ఫిర్యాదుదారుల్లో మహిళలే అధికం
- చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): 'అయ్యా.. ఇవిగోండి మా ఫిర్యాదులు. వేగంగా విచారించి న్యాయం చేయండి' అని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. 98 మంది తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో అధికారులకు అందజేశారు. కాగా ఫిర్యాదుదారుల్లో మహిళలే అధికంగా ఉన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతులిచ్చారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- కావలి రూరల్ మండలానికి చెందిన ఓ మహిళకు ఆరునెలల క్రితం ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తాను చెప్పినంత నగదు పంపాలని లేనిపక్షంలో వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని, బంధువులకు, స్నేహితులకు పంపుతానని బెదిరించాడు. దీంతో ఆమె పలు దఫాలుగా రూ.50 లక్షల వరకు సదరు వ్యక్తికి ఇచ్చింది. ఇంకా అతడు నగదు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేసింది. ఆయన స్పందించి విచారణ చేయాలని సైబర్ సిబ్బందిని ఆదేశించారు.
- నెల్లూరు బాలాజీ నగర్‌కు చెందిన ఓ మహిళ ఓ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొద్దిరోజులు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించసాగాడు. బాధితురాలి కుటుంబసభ్యులను సైతం బెదిరించాడు. దీంతో భర్త నుంచి రక్షణ కల్పించాలని కోరింది. విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బాలాజీ నగర్ పోలీసులను ఎస్పీ ఆదేశించారు.
- తన భర్త చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేశాడని, తనను, పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని విడవలూరుకు చెందిన ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొద్దిరోజులుగా చంపుతామని బెదిరిస్తున్నాడని రక్షణ కల్పించాలని కోరింది.
- కుటుంబ కలహాల నేపథ్యంలో తన భర్త ఎటో వెళ్లిపోయాడని, ఆయన ఆచూకీ తెలియజేయాలని మూలాపేటకు చెందిన ఓ మహిళ కోరారు. స్పందించిన ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాలని చిన్నబజారు పోలీసులకు సూచించారు.
- కుటుంబ కలహాల నేపథ్యంలో మనుమడు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అతడి నుంచి రక్షణ కల్పించాలని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేసింది.

నాలుగో అంతస్తు నుంచి దూకి..

- వివాహిత ఆత్మహత్య
- అల్లుడిపై మామ హత్యాయత్నం
- నెల్లూరులో దారుణం

నెల్లూరు(క్రైమ్): దంపతుల నడుమ విభేదాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె మృతిని జీర్ణించుకోలేని మృతురాలి తండ్రి అల్లుడిపై కత్తితో దాడి చేశాడు. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. నెల్లూరు బీవీ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ హఫీజ్, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన అయేషా కౌసర్ (28) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వీరు 2019లో హైదరాబాద్‌లో పనిచేస్తున్న సమయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి నాలుగేళ్ల పాప ఉంది. వివాహానంతరం బీవీ నగర్‌కు వచ్చి ఇంటి నుంచే విధులు నిర్వహిస్తున్నారు. హఫీజ్ తమ్ముడు కౌసర్ సోదరిని వివాహం చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆరునెలల క్రితం హఫీజ్, కౌసర్ దంపతులు రామ్‌జీనగర్ ఏడో వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో హఫీజ్ తండ్రి అనారోగ్యానికి గురయ్యాడు. పెద్ద మొత్తం ఖర్చుపెట్టి తండ్రికి చికిత్స చేయించాడు. ఈ విషయమై ఆదివారం దంపతుల నడుమ వాగ్వాదం జరిగింది. దీంతో కౌసర్ మనస్తాపానికి గురై నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెద్ద శబ్దం రావడంతో బయటకు పరుగులు తీసిన హఫీజ్ ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను చికిత్స నిమిత్తం సమీపంలోని మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్లుడే చంపేశాడంటూ..

కౌసర్ మృతిపై సమాచారం అందుకున్న ఆమె కుటుంబసభ్యులు సోమవారం మెడికవర్ హాస్పిటల్‌కు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమ కుమార్తెను అల్లుడే చంపేశాడని మృతురాలి తండ్రి అలీఖాన్ ఆరోపిస్తూ కోపంతో రగిలిపోయి తనవెంట తెచ్చుకున్న కత్తితో హఫీజ్‌ను బలంగా పొడిచాడు. గాయాలపాలైన హఫీజ్ నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వ వైద్యులు కౌసర్ మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. వివాహిత మృతిపై బాలాజీ నగర్ పోలీసులు, హఫీజ్‌పై కత్తితో దాడి చేసిన ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

- యూట్యూబర్ దుర్మరణం



సోంబాబు (ఫైల్)

తొండంగి: బైక్ రైడర్‌గా, యూట్యూబర్‌గా సోషల్ మీడియాలో పేరొందిన పొగాకు సోంబాబు (క్రేజీ సోంబాబు) కాకినాడ జిల్లా బెండపూడి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన పొగాకు సోంబాబు (35) వృత్తి రీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ప్రకృతి అందాలను చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రాజమహేంద్రవరంలో స్నేహితుని వివాహానికి తోటి బైక్ రైడర్స్‌తో కలిసి హాజరయ్యాడు. అనంతరం బైక్‌లపై దునపాటి రాజేష్, వెంకట్‌తో కలిసి లంబసింగి, అరకు తదితర ప్రాంతాలను సందర్శించాడు. అనంతరం విశాఖ నుంచి రాజమహేంద్రవరం బయలుదేరారు. అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. సోంబాబు బైక్‌ను జాతీయ రహదారిపై బెండపూడి వై.జంక్షన్ వద్ద భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడగా 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కావలి: కావలి పట్టణంలోని తుఫాన్ నగర్‌కు చెందిన తన్నీరు అశోక్ (19) అనే యువకుడు సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ కె.శ్రీనివాసరావు కథనం మేరకు.. అశోక్ టీచర్స్ కాలనీలో టైల్స్ వేసే పని చేస్తుండగా విద్యుత్ షాక్ గురై చనిపోయాడు. దీంతో బాధిత తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.